
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 30 ఆగస్టు 2025
5

పంటల నష్టంపై ప్రాథమిక అంచనాలు

- జిల్లాలో సర్వే నిర్వహించిన వ్యవసాయాధికారులు
- సుమారు 1500 ఎకరాల్లో దెబ్బతిన్న పైర్లు

6





భద్రాద్రి వద్ద గోదావరి ప్రవాహం

ఉగ్రరూపం దిశగా..

- దోబూచులాట తర్వాత భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి
- 7.22 గంటలకు మొదటి హెచ్చరిక జారీ
- 11 గంటలకు 44.70 అడుగులకు చేరిక
- 50 అడుగులు దాటే అవకాశం ఉందంటున్న అధికారులు
- దేవస్థానం స్నానఘట్టాలు, కల్యాణకట్ట కింది భాగం మునక
- జలమయమైన పర్ణశాల నారచీరల ప్రాంతం
- సున్నంబట్టి-బైరాగులపాడు మార్గంలో రాకపోకలకు అంతరాయం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం

భద్రాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దోబూచులాట తర్వాత భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతూ ఉగ్రరూపం దాల్చే దిశగా ప్రవహిస్తోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 36.8 అడుగులకు తగ్గిన నీటిమట్టం శుక్రవారం ఉదయం 6 గంటలకు 35.2 అడుగులకు తగ్గింది. గంటపాటు నిలకడగా ఉన్న గోదావరి ఉదయం 8గంటల నుంచి మళ్లీ పెరుగుతోంది. 9 గంటలకు 35.8 అడుగులకు చేరుకోగా మధ్యాహ్నం 12 గంటలకు 37.5, 3 గంటలకు 39.9, సాయంత్రం 6 గంటలకు 42.2అడుగులకు పెరిగింది. ఇక రాత్రి 7.22గంటల సమయంలో 43 అడుగులకు చేరుకోవటంతో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరిక ను జారీ చేశారు. 11 గంటలకు 44.70 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. అయితే ఎగువ నుంచి వస్తున్న వరద అంచనాల మేరకు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 48 అడుగులను చేరుతుందని, శనివారం ఉదయానికి 50 అడుగుల వరకు వచ్చే అవకాశం కూడా ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అ ప్రమత్తమైంది. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని డివిజన్, మండల స్థాయి అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ముంపునకు గురయ్యే ప్రాంతాల వారిని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అధికారులకు నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు సహకరించాలని జిల్లా అధికార యంత్రాంగం కోరింది. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భద్రాచలంలోని గోదావరి స్నానఘట్టాలు పూర్తిగా నీటమునిగాయి. అలాగే స్నాన ఘట్టాల వద్ద ఉన్న భద్రాచలం దేవస్థానం కల్యాణ కట్ట (మిగతా 6వ పేజీలో)

వరదపై అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కలెక్టర్‌కు మంత్రి తుమ్మల ఆదేశం



కొత్తగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను ఆదేశించారు. భారీ వర్షాల పడుతున్న క్రమంలో ఆయన కలెక్టర్‌తో మాట్లాడారు. పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, రైతులు, పశువుల కాపరులు వాగులు, వంకలు దాటకుండా కట్టడి చేయాలని, అందుకోసం పోలీస్ సిబ్బంది సేవలు వినియోగించుకోవాలన్నారు. తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో వరద నీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వరదలతో పూర్తిగా నిండిన చెరువులు తెగిపోయే ప్రమాదం ఉండటంతో నీటి పారుదలశాఖ అధికారులు, సిబ్బంది చెరువులు వద్ద పర్యవేక్షించాలన్నారు. ఎగువ నుంచి గోదావరికి భారీగా వరద ఉధృతి వస్తుండటంతో భద్రాచలం వద్ద ఉన్న కరకట్ట స్లూయిస్ లీకేజీ కాకుండా, పట్టణంలో వాన నీరు కరకట్ట వద్ద నిల్వకుండా ఎత్తిపోసే మోటార్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అత్యవసర వైద్యసేవలు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వరదల పట్ల యంత్రాంగం సహాయ చర్యలకు సన్నద్ధంగా ఉండాలన్నారు.



కూసుమంచి మండలం లింగారాంతండాలో మొక్కనాటుతున్న మంత్రి పొంగులేటి

యూరియా సరఫరాలో

అవకతవకలు జరిగితే సస్పెండే

- పాలేరు రైతులకు 'ప్యాక్స్' కేంద్రాల ద్వారా అందించాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి సూచనలు
- కలెక్టర్‌తో కలిసి కూసుమంచిలో యూరియా పంపిణీపై సమీక్ష
- మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కూసుమంచి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : యూరియా సరఫరాలో అవకతవకలు జరిగే సస్పెండ్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను హెచ్చరించారు. ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ (ప్యాక్స్) కేంద్రాల ద్వారా పాలేరు రైతులకు యూరియా సరఫరా చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం కూసుమంచి మండలంలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్యటించిన ఆయన తొలుత పలురోడ్లకు శంకుస్థాపనలు, గ్రామపంచాయతీ భవనాలకు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో యూరియా సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఏప్రిల్ నుంచి కేంద్రం తెలంగాణకు కేటాయించిన స్థాయిలో సరఫరా చేయని కారణంగా యూరియా కొరత ఏర్పడిందన్నారు. రామగుండం, ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిందన్నారు. రానున్న రోజుల్లో 1,600 మెట్రిక్ టన్నులు యూరియా వస్తుందన్నారు. పాలేరు నియోజకవర్గంలో రైతులకు ప్యాక్స్ సొసైటీల ద్వారా మాత్రమే రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని, యూరియా అక్రమ రవాణా అరికట్టాలని తెలిపారు. యూరియా పంపిణీలో ఎటువంటి తప్పులు జరిగినా చర్యలు తీసుకుంటామని, గతేడాది కంటే ఎక్కువ యూరియా అమ్మినట్టు రిపోర్టు ఉందని అయినా క్షేత్రస్థాయిలో సమస్యలు ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా (మిగతా 6వ పేజీలో)

ఖమ్మం 19, భద్రాద్రి 27

- 'హరిత దవే ఆఫ్‌లైఫ్ - ఎకో మిత్ర' పోటీల్లో ఇరు జిల్లాల స్థానాలివీ..



పర్యావరణ కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను పర్యావరణ మిత్రగా తీర్చిదిద్దేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టింది. దేశ వ్యాప్తంగా హరిత దవే ఆఫ్ లైఫ్ అనే ఇతివృత్తంతో ఎకోమిత్ర పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండగా.. జిల్లాల విభాగంలో జనగామ ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ జాబితాలో ఖమ్మం 19వ, భద్రాద్రి కొత్తగూడెం 27వ స్థానంలో ఉన్నాయి.

ఎకో మిత్ర పోటీల ముఖ్య ఉద్దేశం..

వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి రక్షణకు మొక్కలను నాటాలని, వాటిని పరిరక్షించడానికి, విద్యార్థులు పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నీటి సంరక్షణ, వ్యర్థాలు వేరు చేయడం లాంటి పద్ధతులపై ప్రతి విద్యార్థిలో (మిగతా 6వ పేజీలో)

మొలుగుమాడు భూములకు

'టిప్పన్'

- రెండు నెలల్లో సర్వే నెంబర్ల ఏర్పాటుకు నోటీసులు జారీ
- అభ్యంతరాలు తెలిపిన 138 మంది..



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : భూభారతి చట్టంతో రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఐదు గ్రామాల్లో ఒకటైన ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామంలో భూసర్వే పూర్తికావడంతో.. రెండునెలల్లోపు ఆ భూములకు టిప్పన్ సర్వేనెంబర్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా భూసర్వేవిభాగం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలో భూసర్వే నిమిత్తం సర్వే నెంబర్లు సక్రమంగా లేని ఐదు గ్రామాలను మోడల్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో మొలుగుమాడు కూడా ఉంది. గ్రామంలో సర్వేనెంబర్లు లేకపోవడం, తక్కువ సర్వేనెంబర్లు ఉండడం, పట్టాభూములున్నా సర్వేనెంబర్లు లేక మ్యాపులు లేక భూరికార్డుల్లో సరైన పద్ధతులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు కూడా సరిహద్దుల నిర్ణయం సమస్యగా ఉంది. కొన్నేళ్లగా ఈ గ్రామంలో భూసర్వే (మిగతా 8వ పేజీలో)

భద్రాద్రి ఈవోగా

దామోదరరావు బాధ్యతలు

- సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికిన దేవస్థానం సిబ్బంది
- ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనం



భద్రాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కలెక్టర్ కె.దామోదరరావు శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ముందుగా దేవస్థానం ఈవో దంపతులు రామాలయానికి రాగా దేవస్థానం వైదిక, పరిపాలనా సిబ్బంది వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సమయంలో దేవస్థానం తరుపున (మిగతా 6వ పేజీలో)

ఉత్సాహంగా 3కే రన్

ఖమ్మంలో ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 3కే రన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జెండా ఊపి ప్రారంభించారు. సర్దార్‌పటేల్ స్టేడియం వద్ద ప్రారంభమైన రన్ రోటరీనగర్ మీదుగా సాగి తిరిగి ఎస్పీ స్టేడియం వద్ద ముగిసింది. ర్యాలీలో యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని సందడి చేశారు. అనంతరం ఎస్పీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులతో నేషనల్ స్పోర్ట్స్ డే ప్రతిజ్ఞ, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా జాతీయ క్రీడాపోటీల విజేతలను సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు చదువుతో పాటు జీవితంలో భాగం కావాలని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తామని, నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేస్తామన్నారు.



రన్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉత్సాహికులు

కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఇంటర్ విద్యాధికారి రవిబాబు, స్టేడియం మేనేజర్ ఉదయ్‌కుమార్, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరంతర కృషి అవసరం..



కార్యక్రమంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

- డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మొదటి బ్యాచ్ విద్యార్థులతో భద్రాద్రి కలెక్టర్ జితేష్
- ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం ప్రారంభం
- ఐదు రోజులపాటు నిర్వహణ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనలో నిరంతర కృషి చేసిన వ్యక్తులు మంచి భవిష్యత్ ఉంటుందని, దేశాభివృద్ధిలో సేవలు అందించిన ఇంజనీర్లను ఆదర్శవంతంగా తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ టి.జగన్‌మోహన్‌రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ దేశ, విదేశాలకు అత్యుత్తమ సేవలు అందించిన డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన జీవిత చరిత్ర గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కొత్తగా చేరే విద్యార్థులు ప్రతి రోజు తరగతులకు హాజరుకావడమే కాకుండా సబ్జెక్టులను అవగాహనతో, ప్రయోగాత్మకంగా, పరిశోధనాత్మకంగా అధ్యయనం చేయాలని సూచించారు. మారుతున్న మార్కెట్‌కు అనుగుణంగా కొత్త అంశాలను తెలుసుకోవాలన్నారు. ఇంజనీరింగ్, ఎర్త్ సైన్స్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని, ఎర్త్‌సైన్స్ కోర్సులకు అవసరమైన మైన్స్ కర్మాగారాలు, భౌగోళిక పరిస్థితులు భద్రాద్రి జిల్లాలో ఉన్నాయని తెలిపారు. కాలేజీ చదువుల్లో వివిధ రకాల అంశాలు విద్యార్థులపై ప్రభావం చేస్తాయని లక్ష్య సాధనలో ఏకాగ్రత ఉండాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీ (మిగతా 6వ పేజీలో)

ఆరోగ్యశ్రీ బకాయిలు..

రూ.25 కోట్లు

- రేపటి నుంచి నిలిచిపోనున్న సేవలు
- ఆందోళన చెందుతున్న రోగులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ బకాయిల భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రులు తమ సేవలను నిలిపివేసేందుకు నిర్ణయాన్ని తీసుకున్నాయి. ప్రభుత్వం పది రోజుల్లో తమ బకాయిలను చెల్లించకుంటే ఆగస్టు 31 నుంచి సేవలు నిలిపివేస్తామంటూ నిర్ణయాన్ని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెట్‌వర్కు ఆస్పత్రులకు రూ.20 కోట్ల బకాయిలున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా 4 కోట్లకుపైగా బకాయిలున్నట్లు తెలిసింది. జిల్లాలో ఉన్న ఆస్పత్రులకు 14నెలల నుంచి బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదు. ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ బకాయిలు 18నెలల నుంచి రావడం లేదని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

రూ.25 కోట్ల బకాయిలు...!

ఆరోగ్యశ్రీ పథకం కింద ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 33 ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రులు 16 వరకు ఉన్నాయి. వీటిలో డయాలసిస్‌తో పాటు 970 కిపైగా సేవలు నిరుపేదలకు ఉచితంగా సేవలు అందుతున్నాయి. ఈ పథకాన్ని 2023 డిసెంబర్ నాటికి స్వల్ప బకాయిలుండగా తాజాగా (మిగతా 6వ పేజీలో)

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఖమ్మం జిల్లాలో నెట్వర్క్ ప్రైవేటు ఆస్పత్రులు	:	18
ప్రభుత్వ ఆస్పత్రులు	:	7
అర్హులైన కుటుంబాలు	:	4,11,347
భద్రాద్రి జిల్లాలో నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రులు	:	15
ప్రభుత్వ ఆస్పత్రులు	:	9
అర్హులైన కుటుంబాలు	:	2,93,322

బొమ్మల శ్రీ యాదగిరి క్షేత్ర మహత్యం గ్రంథం ఆవిష్కరణ

ఆవిష్కరించిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్

రచయిత భద్రాద్రి దేవస్థానం శ్రీరామాయణ పారాయణదారుడిని, చిత్రకారులకు ప్రశంస


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం శ్రీరామాయణ పారాయణ దారు ఎస్‌టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన బొమ్మల శ్రీయాదగిరి క్షేత్ర మహత్యం గ్రంథంను దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ శైలజా రామయ్యర్, ఎన్.వెంక ట్రావు, భువనగిరి కలెక్టర్ హనుమంతరావులు ఆవిష్కరించారు. యాదగిరిగుట్టలో శుక్రవారం వారు ముందుగా బొమ్మల శ్రీయాదగిరి క్షేత్ర మహత్యం గ్రంథంను ఆవిష్కరించారు. ఈ సమయంలో వారు గ్రంథ రచయిత భద్రా ద్రి దేవస్థానం శ్రీరామాయణ పారాయణదారు ఎస్‌టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, చిత్రకారుడు ఎన్.వెంకట రమణలను ప్రశంసించారు. ఈ కార్య క్రమంలో యాదగిరిగుట్ట వైదిక పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సర్దార్‌పటేల్ ఇండోర్ స్టేడియంలో అండర్-15 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ క్రీడలలో రాణించడం ద్వారా ప్రపంచానికి పరిచయమవుతారని అన్నారు. జిల్లాలో ఉన్న క్రీడా వసతులను వినియోగించుకొని క్రీడాస్ఫూర్తితో రాణించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించడం ద్వారా తమ తల్లిదండ్రులను, తమ జన్మస్థలానికి ఖ్యాతిని తీసుకొస్తారని అన్నారు. చిన్నతనం నుంచి క్రీడలు అలవాటు చేసుకొని ప్రతిభ చాటాలని అన్నారు. అనంతరం రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు, ఏసీపీ ఘంటా వెంకట్రావు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీపడాలన్నారు. క్రీడలతో ఉజ్వలభవిష్యత్ ఉంటుందని ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా నిత్యం ఆటలు ఆడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. నగరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 174 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలలో తొలిరోజు మెయిన్‌డ్రా పోటీలలో భాగంగా లీగ్ పోటీలను నిర్వహించగా శని, ఆదివారాల్లో సెమీస్, ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వింజనంపాటి చంద్రశేఖర్, కార్పొరేటర్ కమర్తపు మొరళి, అసోసియేషన్ బాధ్యులు జట్ల శ్రీను, రవిమారుత్, యుగంధర్, కొంగర శ్రీనివాస్, దుద్దుకూరి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, చావా వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

యూరియా కోసం వెతలు


లారీని అడ్డుకున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు


దుమ్ముగూడెం మండలం నరసాపురం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వచ్చి అన్నదానం స్వీకరిస్తున్న రైతులు

ఇల్లెందులో లారీని అడ్డుకున్న రైతులు

దుమ్ముగూడెం మండలంలో అన్నదాతలకు అన్నదానం

ఇల్లెందురూరల్ / దుమ్ముగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతుల వెతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఒక యూరియా కట్ట కోసం వారు పడుతున్న బాధలు వర్ణాతీతం. గత కొద్ది రోజులుగా క్యూల్లో నిల్చుని ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నిజాంపేట గ్రామంలో పీఏసీఎస్ ఉపకేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు అక్కడ బారులు తీరారు. కొందరైతే కుటుంబాలతో సహా వచ్చి వేచిచూశారు. ఈ క్రమంలో లారీలో వచ్చిన బస్తాల్లో నిజాంపేట కేంద్రానికి 225 బస్తాలు కేటాయించి మిగిలిన 225 బస్తాలను కొమరారంలోని పీఏసీఎస్ కేంద్రానికి తరలించాలని అధికారులు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. క్యూలో ఇంతమంది రైతులుంటే 225 బస్తాలు దిగుమతి చేస్తే ఎలా అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కనీసం క్యూలో నిలుచున్న వారికి ఒక్క బస్తా అయినా ఇవ్వాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఇల్లెందు సీఐ తాటిపాముల సురేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. పెద్దఎత్తున తరలివచ్చిన రైతులందరికీ ఒక్కో బస్తా చొప్పున ఇచ్చేలా అధికారులతో మాట్లాడి పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేయించారు.

అన్నదాతకే అన్నదానం

దేశానికి అన్నం పెట్టే రైతుకే అన్నదానం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సొసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నరసాపురం పీఏసీఎస్ గోదాం వద్ద యూరియా కోసం వచ్చిన రైతన్నల కోసం నరసాపురం చినఅరుణాచలం ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. యూరియా కోసం రైతులు గోదాం వద్దకు వచ్చినన్ని రోజులు ఎంతమంది వచ్చినా ఈ అన్నదానం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే తమ ఆలయం ద్వారా పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నామని శివనాగస్వామి తెలిపారు.

విభిన్న గణపయ్య.. నిను మొక్కెదమయ్య..


ఖమ్మం రేవతిసెంటర్‌లో ఏర్పాటు చేసిన హనుమాన్ అవతారంలోని లంబోదరుడి విగ్రహం


ఖమ్మం మామిళ్లగూడెంలో నెలకొల్పిన 'క్షీరసాగర మదనం' సెట్టింగులో మట్టి వినాయక ప్రతిమ


సరిత క్లినిక్ సెంటర్‌లో నెలకొల్పిన వినాయకుడి ఉగ్రరూప శివుడి అవతారం

పంటల నష్టంపై ప్రాథమిక అంచనాలు

ఖమ్మం జిల్లాలో సర్వే నిర్వహించిన వ్యవసాయాధికారులు

సుమారు 1500 ఎకరాల్లో దెబ్బతిన్న పైర్లు


చింతకాని మండలంలో పత్తి చేలల్లో నిలిచిన నీరు

ఖమ్మం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల నష్టంపై ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక సర్వే నిర్వహించింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో పలుచోట్ల వాగులు, చెరువులు పొంగి ప్రవహించడంతో.. వాటి పరిధిలో ఉన్న పత్తి, వరి, మొక్కజొన్న, పెసర చేలు నీటమునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం తెరిపినివ్వడంతో సుమారు 4వేల ఎకరాలకుపైగా నష్టం బారి నుంచి బయటపడ్డాయి. 30శాతం కంటే అధికంగా జరిగిన నష్టాన్ని మాత్రమే వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించగా.. 1500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. పత్తిపొలాల్లో నీరు చేరడంతో పొలాలు ఎర్రబడుతున్నాయి. కాతకు వచ్చిన పెసర పంట చాలా వరకు దెబ్బతిన్నది. జిల్లాలో వేల ఎకరాల్లో పెసర పంట వేయగా కోతదశలో ఉండటంతో ఆ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే పూర్తిస్థాయి సర్వే చేస్తేనే నష్టం వివరాలు చెప్పే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. శుక్రవారం తెరపి వాతావరణంతో పొలాల్లో నీరు మొత్తం పోవడంతో చాలావరకు నష్టం తగ్గింది. కొన్నిచోట్ల పత్తి, వరి పంటలు నేలకొరిగాయి. వైరా మండలంలో ముసలిమడుగు, కొండకొడిమ, సోమవరం, వల్లాపురం, కల్లూరు మండలం చిన్నకోరు కొండి, తల్లాడ మండలం బిల్లుపాడు, మల్లవరం, అన్నారుగూడెం, పినపాక, కేశ్వాపురం, కొణిజర్ల మండలం తీగలబంజర, పల్లిపాడు, సింగరాయపాలెం, గుబ్బగుర్తి తదితర గ్రామాల్లో పత్తి, వరి దెబ్బతిన్నాయి. చింతకాని మండలంలో పెసర పంటకు ఎక్కువ నష్టం జరిగింది.

నారచీరల వద్ద పెరిగిన వరద ఉధృతి


నారచీరల వద్ద మునిగిన దుకాణాలు

దుమ్ముగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల నారచీరల వద్ద శుక్రవారం గోదావరి వరద ఉధృతి పెరిగింది. దీంతో నారచీరల ప్రాంతం, దుకాణాలు నీట మునిగాయి. సున్నంబట్టి- బైరాగులపాడు మధ్య లోలెవల్ చప్టాపైకి వరదనీరు చేరడంతో రెండో రోజూ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. తూరుబాక డైవర్షన్ రోడ్డు వద్దకు క్రమంగా వరద చేరుతోంది. ఇదే వేగంగా వరద ప్రవాహం పెరిగితే శనివారం ఉదయానికి రోడ్డు ముంపునకు గురవుతుంది. దీంతో భద్రాచలం- చర్లల మధ్య ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

పొంచి ఉన్న 'గండి' ప్రమాదం

ఆందోళన చెందుతున్న రైతాంగం



కల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఇటుకరాళ్ల చెరువు కట్ట భారీ వర్షాలకు తూము వద్ద గల కట్టపై భాగం కుంగినది. దీంతో ఈ చెరువు పరిధిలో గల ఆయుకట్టు రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు ప్రధాన తూము లీకేజీ కావటంతో సమీపాన కట్ట భాగం మట్టి వదులుగా మారి సుమారు 5 మీటర్లు పొడవున కుంగినది. ఈ మేరకు కల్లూరు జలవనరులశాఖ డీఈ జడ్.రత్నాకర్, ఏఈ శివకుమార్‌లు చెరువుకట్ట కుంగిన ప్రదేశాన్ని సందర్శించారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు.. రూ.25 కోట్లు

(5వ పేజీ తరువాయి)

25కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం, గత జనవరిలో నెట్ వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురాగా కొద్దిమొత్తంలో చెల్లించి ఆందోళనను విరమింపచేశారు. ప్రస్తుతం 14నెలలుగా పూర్తి బకాయిలు విడుదల కాకపోవడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు సేవలు నిలిపివేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం కూడా ఆరోగ్యశ్రీతో అనుసంధానమయ్యాయి. అంతే కాదు ప్రభుత్వం తాజాగా ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల వరకు కూడా పెంచింది. చిన్న చిన్న శస్త్రచికిత్సలు కూడా దీని కింద నెట్వర్క్ ఆసుపత్రులు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కింద చెల్లించే బకాయిలు మాత్రం ఇటీవల ఒక్కో ఆస్పత్రికి రూ.5లక్షలు, రూ.10లక్షలు చొప్పున విడుదల చేశాయి కానీ రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు మాత్రం విడుదల చేయలేదు. బకాయిలు కుప్పలు కుప్పలుగా పెరిగిపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను నిలిపివేయనున్నట్లు తెలిసింది.

పరికరాలు సరఫరా చేసే సంస్థలు నిలిపివేస్తున్నాయి

డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, నెట్‌వర్క్ ఆస్పత్రుల అధినేత



ఆరోగ్యశ్రీ బకాయిలు పెద్దమొత్తంలో పేరుకుపోయాయి. ఒక్కో ఆస్పత్రికి కనీసం 14నెలల బకాయిలు కనీసం రూ 3కోట్ల వరకు ఉన్నాయి. ఆపరేషన్లు ఇతర పరికరాలను సరఫరా చేసే సంస్థలు ఆస్పత్రుల బకాయిలకు 45 రోజులు మాత్రమే గడువు ఇస్తున్నారు. ఆ తర్వాత మాకు సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో ఏం చేయలేకపోతున్నాం. వారికి చేతి నుంచి అంత పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ బకాయిలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బకాయిలు మాత్రం ఏళ్లతరబడి చెల్లించడం లేదు. అందుకే సేవలు నిలిపి వేసే నిర్ణయాన్ని సమర్థిస్తున్నాం.

ఉగ్రరూపం దిశగా..

(5వ పేజీ తరువాయి)



కిందిభాగంలోకి వరద నీరు చేరింది. దీంతో భక్తులు, పర్యాటకులు గోదావరి స్నానఘట్టాల వద్దకు రాకుండా అధికారులు మెష్‌లను, బారికేడింగ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే గజ ఈతగాళ్లను కాపలా ఉంచారు. ఇదిలా ఉండగా దుమ్ముగూడెం మండలం తూరుబాక డైవర్షన్ రోడ్డుపైకి వరద నీరు వచ్చి చేరుతుంది. కాగా దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో ఉన్న సీతమ్మ నారచీరల ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. అదే విధంగా సున్నంబట్టి- బైరాగులపాడు మధ్య రహదారిపైకి వరద నీరు చేరటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జిల్లాలో స్వల్ప వర్షపాతం

కొత్తగూడెం, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు స్వల్ప వర్షపాతం నమోదైంది. జిల్లాలోని దుమ్ముగూడెంలో 4.6 సెంమీ వర్షపాతం నమోదు కాగా, కరకగూడెంలో 3.43, మణుగూరులో 3 సెంమీ, అశ్వాపురంలో 2.73, కొత్తగూడెంలో 2.4, అశ్వారావుపేటలో 1.88, ముల్కలపల్లిలో 1.5, దమ్మపేటలో 1.33, పాల్వంచ, అన్నపురెడ్డిపల్లిలో 1.28, చుంచుపల్లిలో 1.15, లక్ష్మీదేవిపల్లిలో 1సెంమీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 1 సెంమీ లోపు వర్షం పడింది.

ముడి పామాయిల్ ట్యాంకర్ బోల్తా

దమ్మపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ముడి పామాయిల్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటన దమ్మపేట మండలం రామచంద్రాపురం గ్రామ సమీపంలో చెరువు వద్ద బోల్తా పడింది. ఈఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి ట్యాంకర్‌లో క్రూడ్ పామాయిల్ నింపుకొని శుక్రవారం రాత్రి షాద్‌నగర్‌కు బయలు దేరింది. రామచంద్రాపురం గ్రామం దాటాక మూలమలుపు వద్ద అదుపు తప్పి ట్యాంకర్ చెరువు వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొందరు స్థానికులు ప్రమాద సంఘటనను ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్‌కు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు మాత్రం డ్రైవర్ మద్యం సేవించి నటపడటం వల్లే ట్యాంకర్ ప్రమాదం జరిగిందని అంటున్నారు.

మంత్రి తుమ్మల ఆరా...

క్రూడ్ పామాయిల్ ట్యాంకర్ బోల్తా పడిన విషయాన్ని స్థానికులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల ఆయిల్‌ఫెడ్ అధికారుల ద్వారా సమాచారాన్ని తెలుసుకొని ట్యాంకర్ లోని క్రూడ్ పామాయిల్‌కు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఖమ్మం 19, భద్రాద్రి 27

(5వ పేజీ తరువాయి)


డాక్టర్ ప్రసన్న కుమార్

అవగాహన పెంపొందించేందుకు ఈ ఎకో మిత్ర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు హరిత్ దవే ఆఫ్‌లైఫ్ అనే నినాదంతో దేశ వ్యాప్తంగా జూలై 1 నుంచి ఆగస్టు 27వ తేదీ వరకు నిర్వహించారు. కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వశాఖల సహకారంతో జరిగిన ఈ పోటీల్లో 1 నుంచి 5వ తరగతి, 5-8వ తరగతి, 9-12 తర్వాత, డిగ్రీ, పీజీ, పరిశోధకులు ఇతర సాధారణ వ్యక్తులు పాల్గొనే విధంగా వీలు కల్పించారు. మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్, క్విజ్ పోటీలు ఉంటాయి. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పని సరిగా మొక్కలు నాటుతున్నది.. సీడ్‌బాల్స్, మట్టిగణపతుల తయారీ పర్యావరణ పరిరక్షణ నీటిని పొదుపు చేస్తున్న ఫొటోలను తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలి. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ వస్తుంది. దేశంలో 58 రోజులపాటు ప్రతి రోజు విద్యార్థులను, ఉపాధ్యాయులను కార్యోన్ముకులుగా చేసిన పర్యావరణ పోటీల కో చైర్మన్ డాక్టర్ ప్రసన్నకుమార్‌ను విద్యాశాఖాధికారులు, ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు పలువురు ఆయన చేసిన సేవలను అభినందించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని, యు వత పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తోన్నట్లు డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు.

యూరియా సరఫరాలో

అవకతవకలు జరిగితే సస్పెండే

(5వ పేజీ తరువాయి)


కూసుమంచి మండలం జీళ్లచెరువులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

ప్రభుత్వ పాలన సాగుతోందని రెవిన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదలకు దెబ్బతిన్న కాల్వలు, రోడ్డు మరమ్మతులు, అంతర్గత సీసీరోడ్డు, పశువైద్యశాల, తాగునీటి సరఫరాపనులు, లింక్‌కెనాల్ నిర్మాణం లాంటి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. టెండర్ ప్రక్రియ త్వరగా ముగించి అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మల్లాయిగూడెం నుంచి భగత్‌వీడు రూ.3.30కోట్లు, రూ.1.22కోట్లతో హట్యాతండా రోడ్డు, రూ.45లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు ప్రారంభించినట్లు తెలిపారు. జీళ్లచెరువులో రూ.2.25కోట్లతో ఆలయం వరకు ఘాట్ రోడ్డు, రూ.20లక్షలతో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, డీయల్‌పీవో రాంబాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఈవోగా

దామోదరరావు బాధ్యతలు

(5వ పేజీ తరువాయి)

నూతన ఈవో దంపతులకు శాలువా, స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. అనంతరం ఈవో క్యాంపు కార్యాలయంలో ఈవో దామోదర రావు అధికారికంగా సీటీసీపై సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. కాగా రూ.75000 అన్నదానం పద్దు కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ నిమిత్తం ఈవో తొలి సంతకాన్ని చేశారు.

అందరి సహకారంతో అభివృద్ధి మార్గంలో నడుపుతా: దామోదరరావు

ఈ సందర్భంగా భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించిన తాను బదిలీపై దేవస్థానం ఈవోగా రావటం జరిగిందన్నారు. దేవస్థానం వైదిక, పరిపాలనా అధికారులు, ఉద్యోగుల సహకారంతో భద్రాద్రి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి మార్గంలోకి తీసుకువెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానంలో ఏఈవోలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణారావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అమరవాది శ్రీనివాస రామానుజం, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, సాయిబాబా, ఈవో సీసీ శ్రీనివాసరెడ్డి ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


నిరంతర కృషి అవసరం..

(5వ పేజీ తరువాయి)


ఓరియంటేషన్ క్లాస్‌కు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

రిజిస్ట్రార్ వి.రాంచంద్రమ్ మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీలో అన్ని సౌకర్యాలు కలుగ చేస్తున్నామని, నిష్ణాతులైన అధ్యాపకులు పని చేస్తున్నారని తెలిపారు. జియాలజీ డిపార్టుమెంట్‌హెడ్, యూజీసీ, కేయూ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీ దేశంలో మొదటిసారిగా కొత్తగూడెంలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఎర్త్‌సైన్స్‌తోనే మైన్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, పర్యావరణం అనుసంధానంగా ఉంటాయని తెలిపారు. ప్రపంచ మార్కెట్లో ఎర్త్‌సైన్స్ సబ్జెక్టులకు మంచి డిమాండ్ ఉందని, డిగ్రీ సర్టిఫికెట్స్‌తో సరిపోదని, సబ్జెక్టులపై పూర్తి అవగాహన, సమస్యల పరిష్కారం చూపే ప్రాజెక్టులు అవసరం అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.జగన్‌మోహన్ రాజు కళాశాల గురించి, స్థానిక వాతావరణంపై వివరించారు. నూతన విద్యార్థులకు అధ్యాపకులను పరిచయం చేశారు. ఐదురోజుల పాటు ఈ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యూనివర్శిటి ఇన్‌చార్జీ వైస్ ఛాన్స్‌లర్, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ముఖ్యఅతిథిగా రావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల రాలేకపోయినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

పత్తికి వాన ముప్పు



జూలూరుపాడు మండలం జడలచింత గ్రామంలో నీట మునిగిన పత్తి మొక్కలు

భారీ వర్షాలతో రాలుతున్న పూత, పిందె
ఎర్రబారుతున్న మొక్కలు - కలుపు పెరగడంతో ఇక్కట్లు
రైతులకు భారంగా మారిన పెట్టుబడి

జూలూరుపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఆశలతో పత్తిసాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది పత్తిపంటకు వాతావరణం అనుకూలించి దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉంటుందని అన్నదాతలు భావించారు. కాగా గత కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు తీవ్రనష్టం కలుగుతుండడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలతో సాగుపెట్టుబడి భారం రెట్టింపు అవుతోంది. మొక్కల్లో ఎదుగుదల లోపించి ఎర్రబారుతుండటంతో రైతులు నిరాశకు లోనవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో భద్రాద్రి జిల్లాలో 2. 10లక్షల ఎకరాల్లో రైతులు తెల్లబంగారం సాగు చేశారు. జూలూరుపాడు మండలంలో 20వేల ఎకరాల పంట సాగు అయింది.

రాలిపోతున్న పూత, పిందె



పత్తి పూతను చూపుతున్న రైతు

ప్రస్తుతం పంట పూత, కాయ దశలో ఉంది. మరో నెల రోజుల్లో పంట చేతికి అందనుంది. కాగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురుతో పంటకు నష్టం సంభవిస్తోంది. చెట్టుకు ఉన్న పూత, కాయలు రాలిపోతున్నాయి. తడవడంతో కొన్ని కాయలు నల్లబడిపోయాయి. దీంతో దిగుబడులు తగ్గిపోతాయని రైతులు వాపోతున్నారు. తమ ఆశలపై వర్షం నీల్లు చల్లిందని రైతులు ఆవేదన వక్తపరుస్తున్నారు.

రెట్టింపైన పెట్టుబడి

పత్తి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడి రెట్టింపు కావడంతో కుదేలవుతున్నారు. దుక్కుల నుంచి మొదలుకొని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను పిచికారి చేసి కలుపుతీత పనులను చేపట్టారు. వీటన్నింటికి కలిపి ఒక్కొ ఎకరానికి రైతులు ఇప్పటికే రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ముసురుతో పత్తిచేలల్లో కలుపు అధికమైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కలుపు విపరీతంగా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కలు ఎర్రబారుతున్నాయి. వీటన్నింటిని నివారించి పంటను కాపాడుకునేందుకు రైతులకు పెట్టుబడి మరింత పెరుగుతోంది. పంట దిగుబడి కనిపించకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చేతికి పంట వచ్చే సరికిపెట్టుబడి భారం మరింత రెట్టింపు అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడులు తగ్గుతాయి



ఈ ఏడాది ఏడు ఎకరాల్లో పత్తిపంటను సాగు చేశాను. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పూత, కాయలు రాలిపోతున్నాయి. దీంతో ఎకరానికి 3 నుంచి 4 క్వింటాల దిగుబడులు తగ్గుతాయి. పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని ఆందోళనగా ఉంది.

గుగులోత్ గోపా, రైతు, లైన్‌తండా

అధిక వర్షాలతో పంట నష్టం

అధిక వర్షాలకు పత్తిపంటకు తీవ్రనష్టం వాటిల్లింది. మొక్కలు ఎర్రబారి ఎదుగుదల లోపించడంతో పురుగు మందులు ఎక్కువగా పిచికారి చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి అధికమవుతోంది. వర్షాలు రైతును నిండా ముంచుతున్నాయి.



బాణోత్ భద్రు, రైతు, కొమ్ముగూడెం

స్థానిక ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమీక్ష



రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్షలో ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు వార్డుల వారీగా ఓటర్ల ఫొటోతో కూడిన ముసాయిదా జాబితాను ఆయా గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఈ నెల 28న అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కార్యాచరణ చేశామని తెలిపారు. అసెంబ్లీ ఓటర్లను వార్డుల వారీగా గ్రామ పంచాయతీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30లోగా సంబంధిత ఎంపీడీవోకు అందించాలన్నారు. ఈ అభ్యంతరాలను ఈ నెల 31న పరిష్కరించి, సెప్టెంబర్ 2న వార్డుల వారీగా గ్రామ పంచాయతీ తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో 571 గ్రామ పంచాయతీలకు గాను 5 వేల 214 వార్డులు ఉన్నట్లు చెప్పారు. 8 లక్షల 2 వేల 690 ఓటర్లకు 5 వేల 214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30న మండల స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజ, వివిధ పార్టీల ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్, మిట్టపల్లి కిషోర్, జి.విద్యాసాగర్‌రావు, వై.రాఘవరావు, బండి రావెలు, ఏ.గోపాల్‌రావు, ఎస్.రాజయ్య, బి.తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, బంక మల్లయ్య, కె.కరుణాకర్, ఎం.లహరి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.నరసింహారావు, ఝాన్సీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

చిత్రకళలో మహేంద్ర ప్రతిభ

పర్యావరణ పరిరక్షణకు రెండేళ్ల నుంచి మట్టి గణపతుల తయారీ





బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థి గగ్గూరి మహేంద్ర, అందంగా ముగ్గులు వేస్తున్న విద్యార్థి

దుమ్ముగూడెం ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బొమ్మలు గీయడంతో పాటు మట్టి బొమ్మల తయారీలో ప్రతిభ కనబరుస్తున్నాడు దుమ్ముగూడెంకు చెందిన ఇంటర్ విద్యార్థి గగ్గూరి మహేంద్ర. దుమ్ముగూడెం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మహేంద్ర చిత్రకళ పట్ల మక్కువతో ఆరో తరగతి నుంచి బొమ్మలు గీస్తున్నాడు. పలు రకాల బొమ్మలు వేయడంతో పాటు, గత రెండేళ్లుగా పర్యావరణ పరిరక్షణకు గోదావరి నుంచి మట్టిని తెచ్చి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నాడు.



భరతనాట్యం చేస్తున్న మహేంద్ర

వారం కష్టపడి 3 పెద్ద విగ్రహాలు, 17 చిన్న విగ్రహాలు తయారు చేశాడు. పెద్ద విగ్రహాన్ని రూ.300లు, చిన్న విగ్రహాన్ని రూ.50లకు విక్రయించాడు. అలాగే రంగోలి, ఆర్ట్ డ్రాయింగ్‌లో కూడా ప్రతిభ కనబరుస్తున్నాడు. సెల్‌ఫోన్‌లో చూసి ఆర్ట్ వేయడం నేర్చుకోగా, సొంత సృజనాత్మకతతో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాడు. అలాగే పాఠశాల వేదికపై పలు మార్లు భరతనాట్యాన్ని ప్రదర్శించి అందర్నీ మెప్పించాడు. ఎటువంటి శిక్షణ లేకుండా చిత్రకళలో రాణిస్తున్నాడు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

ఐటీడీఏ పీవో రాహుల్



విద్యార్థులతో ఉద్దీపకం అంశాలను చదివిస్తున్న పీవో

బూర్గంపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైరల్ ఫీవర్ విజృంభిస్తున్నందున హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్ సమన్వయంతో ఉండాలన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం బూర్గంపాడు మండల పరిధిలోని ఉప్పుసాకలోని గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను, ఒడ్డుగూడెం గ్రామంలోని జీపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉప్పుసాక ఆశ్రమ పాఠశాలను సందర్శించి డార్మెటరీ, డైనింగ్‌హాల్, సిక్ రూం, వంటగదిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కలిసికట్టుగా పాటుపడాలన్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అలాగే సిక్ రూంలో వైద్య సేవలు తీసుకుంటున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు రెండు మూడు రోజులకు మించి జ్వరంగా ఉంటే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించి తల్లితండ్రులకు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్, ఏటీడీవో దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఒడ్డుగూడెం జీపీఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్‌బుక్-2 గురించి చిన్నారులకు ఏ విధంగా బోధిస్తున్నది పరిశీలించి, చిన్నారులు అందులోని అంశాలు ఏ విధంగా చదువుతున్నది పరిశీలించారు. ఉద్దీపకం వర్క్‌బుక్ పిల్లలకు బోధన విషయంలో నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉప్పుసాక పాఠశాల హెచ్‌ఎం భీమ, వార్డెన్ శశికళ, ఎస్‌సీఆర్‌పీ మాధవి, ఒడ్డుగూడెం పాఠశాల ఉపాధ్యాయులు బాలు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన అధికారులకు పోలీస్ కమిషనర్ అభినందన



పతకాలు అందుకున్న వారిని అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం 2024, నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసుసేవా పతకాలలో ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో పతకాలు పొందినవారిని సీపీ సునీల్‌దత్ తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. అత్యుత్తమ సేవలకుగాను ఉత్తమసేవా పతకం పొందినవారిలో వైరా ఏసీపీ ఎం.అబ్దుల్ రహమాన్, ఐటీకోర్ ఎస్ఐ పి.సత్యనారాయణ ఉన్నారు. సేవాపతకాలు దక్కిన వారిలో ఏఎస్ఐలు బి.వెంకటరమణరావు, జె.వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటరెడ్డి, ఎస్‌కే సయ్యద్ హుస్సేన్ హెడ్‌కానిస్టేబుల్ మహోన్నత సేవాపతకం సాధించారు.

మతసామరస్యాన్ని చాటుకున్న ముస్లిం యువకుడు



గణేష్ చందాను అందజేస్తున్న ముస్లిం

భద్రాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ఓ ముస్లిం తన భక్తిని చాటుకున్నాడు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేసి సోదర భావానికి ప్రతీకగా నిలిచాడు. భద్రాచలం పట్టణానికి చెందిన మొహమ్మద్ ఆసాద్ హజ్జీ శుక్రవారం భద్రాద్రి మహరాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశాడు. అనంతరం కమిటీ సభ్యులకు రూ.5,116లు చందాను అందజేశారు. ఈ మేరకు ఆయనను కమిటీ సభ్యులు శాలువతో సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

పెదవాగుకు మరమ్మతులు చేయండి

ఆధునికీకరించి సాగునీటిని అందించాలని ఆయకట్టు రైతుల వినతి



జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న రైతులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గతేడాది కొట్టుకుపోయిన పెదవాగు ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునీకరించి సాగునీటిని అందించాలని ఆయకట్టు రైతులు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను మరోసారి కోరారు. పెదవాగు ప్రాజెక్టు కింది ఆయకట్టు రైతులు శుక్రవారం రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాద్ ఆధ్వర్యంలో హుస్సేన్ నాయక్‌ను హైదరాబాదులో ఆయన కార్యాలయంలో కలిశారు. గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షానికి పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు కొట్టుకుపోయింది. ఈ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా తాత్కాలికంగా రింగ్‌బండ్‌ను ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు ప్రాజెక్టు ఆధునీకరణపై దృష్టిపెట్టలేదని ఆరోపించారు. అనంతరం ప్రాజెక్టును సందర్శించిన రైతులు హుస్సేన్ నాయక్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. రెండు రాష్ట్రాల అధికారులు, ఆయకట్టు రైతులను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రెండు రాష్ట్రాల అధికారులు, ఆయకట్టు రైతులను కార్యాలయానికి రావాలని సమాచారం అందించారు. రెండు రాష్ట్రాల అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపినట్లు ఆయకట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు పుట్టా సత్యం, శెట్టిపల్లి కృష్ణారెడ్డి, గారపాటి పుల్లారావు, చిమడబోయిన శ్రీను, వీరబాబు, దుర్గయ్య, కల్లయ్య, శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు.

ఏఎంవోగా శైలేంద్ర..

ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌గా మంగపతి
ఉత్తర్వులు జారీచేసిన ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఏఎంవోగా (అకాడమిక్ మానటరింగ్ అధికారి)గా ఎస్. శైలేంద్ర, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా కూరపాటి. మంగపతిరాజులను నియమిస్తూ ఇంచార్జి డీఈవో అదనపు కలెక్టర్ డాక్టర్, పి శ్రీజ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. శైలేంద్ర ముదిగొండ మండలం చిరుమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గతంలో ఏఎంవోగా పనిచేస్తున్న రాజశేఖర్ పదోన్నతి రావటంతో ఆయన స్థానంలో శైలేంద్రను నియమించారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మంగపతిరాజు ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కోఆర్డినేటర్‌గా ఉన్న పాపారావును బదిలీ చేసి ఆయన స్థానంలో మంగపతిని నియమించిన అదనపు కలెక్టర్.

వరంగల్ తహసీల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన సోదాలు
తహసీల్దార్ స్వగ్రామం తిరుమలాపురం



కోళ్ల ఫారంలో తనఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

చింతకాని, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వరంగల్ సుబేదారి తహసీల్దార్ బండి నాగేశ్వరరావుకు ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న సమాచారంతో వరంగల్ జిల్లాకు చెందిన ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలోని 12 మంది ప్రత్యేక అధికారుల బృందంతో మండలంలో శుక్రవారం సోదాలు నిర్వహించింది. మండల పరిధిలోని తిరుమలాపురంకు చెందిన బండి నాగేశ్వరరావు గత 15ఏళ్లగా రెవెన్యూశాఖలో డీటీ, తహసీల్దార్ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని అందిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు నాగేశ్వరరావు స్వగ్రామంలోని ఇంటితో పాటు ఆయన బంధువులకు చెందిన అనంతసాగర్ గ్రామంలోని కోళ్లఫారంలో కూడా తనఖీలు నిర్వహించారు. మరో బృందం ఖమ్మం నగరంలోని ప్రశాంతినగర్‌లోని తహసీల్దార్ కుటుంబ సభ్యుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గ్రామానికి చేరుకున్న అధికారులు సాయంత్రం 4గంటల వరకు సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఆర్థికలావాదేవీలకు సంబంధించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ కాలువకు మరో 20 ఎకరాల భూసేకరణ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి



గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

కామేపల్లి, ఆగస్ట్ 29(ఆంధ్రజ్యోతి): సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ కాలువకు మరో 20.01 ఎకరాల భూసేకరణ జరుగుతుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం కామేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలంలో పీసా చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించారు. మండంలో అడవిమద్దులపల్లి నుంచి నెమలిపురి వరకు 516 ఎకరాల భూమిని కాలువ నిర్మాణం కింద భూసేకరణకు సర్వే నిర్వహించారు. 2019లో అందులో 496 ఎకరాలకు గాను ఎకరానికి రూ.10.50 లక్షల అవార్డుగా ప్రకటించారు. మిగిలిన 20 ఎకరాలకు ఎలాంటి అవార్డు ప్రకటించలేదు. అంతేకాక ఆ భూమిని ప్రభుత్వం తీసుకోకపోవడంతో గ్రామసభను నిర్వహించారు. ఈ సభలో తహశీల్దార్ సుధాకర్, ఏవో తారాదేవి, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గతంలో ప్రకటించిన అవార్డుని రద్దు చేయాలి

2019లో ప్రకటించిన అవార్డును వెంటనే రద్దుచేసి ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఉన్న రేటును అవార్డుగా ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షుడు దుగ్గి క్రిష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో అంతోటి అచ్చయ్య, సింగం వెంకన్న, రాందాస్, రాములు, సురేష్, ముక్తి సాంబశివరావు ఉన్నారు.

సెప్టెంబరు 22 నుంచి ఓపెన్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం, హైద్రాబాద్, వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్-2025 నెలలో నిర్వహించే ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలు సెప్టెంబరు 22 నుంచి 28 వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ, ఇంచార్జి జిల్లా విద్యాశాఖాధికారి, ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మద్దినేని పాపారావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్స్ అక్టోబరు 6 నుంచి 13వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం సెషన్ 9 నుంచి మధ్యాహ్నం 12వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30ల వరకు ఉంటుందన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ సంఘం సర్వసభ్య సమావేశం

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం ఆదివారం నగరంలోని కిన్నెర హోటల్ నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి పి. రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో భాగంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పర్యవేక్షణలో జరిగే ఈ ఎన్నికకు క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు హాజరుకావాలని కోరారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన గుండ్లపల్లి సురేష్ (40) గ్రామంలోని చెరువులో చేపలవేటకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వల విసరగా ఆ వల సురేష్‌కు చుట్టుకుంది. దీంతో చెరువులో మునిగిపోయాడు. అతడిని రక్షించేందకు సహచరులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ మేరకు మృతుని బంధువులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

50 కిలోల సరుకు పట్టివేత
అదుపులోకి ఐదుగురు, మూడు కార్లు, ఓ బైక్, 8 సెల్‌ఫోన్లు, ఓ ల్యాప్‌టాప్ స్వాధీనం



గంజాయి తరలించే ముఠాను పట్టుకున్న ఏడూళ్లబయ్యారం పోలీసులు

పినపాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం ప్రధాన రహదారి సమీపంలోని పెంటన్నగూడెం క్రాస్ రోడ్ వద్ద ఏడూళ్లబయ్యారం పోలీసులు గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులున్న ఓ ముఠాను గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారంతో గురువారం సాయంత్రం నిఘా పెట్టి పట్టుకున్నట్లు ఏడూళ్లబయ్యారం సీఐ వేల్పూరి వెంకటేశ్వరరావు, ఎస్ఐ పోగు సురేష్ శుక్రవారం పత్రికాముఖంగా వివరాలు వెల్లడించారు. ఈ ఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారిలో కరీంనగర్‌కు చెందిన పల్లెపు ప్రశాంత్, చంద్రుగొండకు చెందిన దాసరి వెంకటేశ్వరరావు, తంబళ్ల పుల్లారావు, చత్తీస్‌గడ్ రాష్ట్రం కుంటకు చెందిన మడకం రాజు, ఖమ్మం జిల్లా చింతకాని మండలానికి చెందిన కొండూరి వినయ్‌లు ఉన్నారు. వీరి వద్ద 50కిలోల గంజాయి, తరలించేందుకు వినియోగించిన మూడు కార్లు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు మాట్లాడారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఈ ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి, ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు నిషేధిత గంజాయిని తరలించేందుకు ప్రణాళిక చేసుకున్నారని, ఇందుకు మూడు కార్లు, ఎస్కార్ట్ వాహనంగా ఓ పల్సర్ బైక్, ల్యాప్‌ట్యాప్, 8 సెల్‌ఫోన్లను వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలను రవాణా చేసినా, అమ్మినా, కొన్నా, సహకరించినా వారిపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని, కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్సూర్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సేకరణలో ప్రజల సంతకాలు తీసుకోవాలి

కేఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో చెత్త సేకరణలో కార్మికులు ప్రజల నుంచి సంతకాల సేకరణ జరపాలని, ప్రజాభిప్రాయం మేరకు పారిశుధ్య కార్మికులు పనితీరు ఉండాలని కేఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని పలువాహనాలను తనిఖీలు చేశారు. లాగ్ బుక్స్ నిర్వాహణ, వాహనాల డీజిల్ వినియోగం, ప్రజాభిప్రాయ సేకరణలో సంతకాలు సేకరణ వంటి అంశాలను పరిశీలించారు. పలుహెచ్చరికలు జారీ చేశారు.

మొలుగుమాడు భూములకు 'టిప్పన్'

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని ఈగ్రామంలో మోడల్ సర్వేచేపట్టాలని నిర్ణయించడంతో ఆయనతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ గ్రామంలో సర్వే ప్రక్రియను జూన్3న ప్రారంభించారు. దీంతో మూడు బృందాలను ఏర్పాటు చేసి గ్రామంలో మొత్తం 103 సర్వేనెంబర్లు 1260 సబ్‌డివిజన్లలో 852.17 ఎకరాలు సర్వే చేసి నిర్ధారణ చేశారు. ఇందులో పట్టా భూమి 227.15 ఎకరాలు 627మంది రైతులకు సంబంధించినదిగా గుర్తించారు. గతంలో ఈగ్రామం ఏపీ పరిధిలో ఉండడంతో భూ రికార్డుల్లో ఉండడం, సెంట్లలో ఉండడం, మ్యాపులు లేకపోవడం తదితర సమస్యలు తలెత్తాయి. ఈ గ్రామంలో ఈనాం భూములు 21.9ఎకరాలు, ప్రభుత్వం భూమి 10.17ఎకరాలు, రోడ్ల కింద 9 ఎకరాలు, వాగుల కింద 9.11ఎకరాలు చెరువుల కింద 25.30ఎకరాలు, గ్రామకంఠం కింద 49.38 ఎకరాలు ఆయా ప్రభుత్వ శాఖల పరిధికి సంబంధించిన భూమిగా 53.29 ఎకరాలుగా నిర్ధారించారు. డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్‌లో సర్వే నిర్వహించి టిప్పన్‌లు సిద్ధం చేశారు. అయితే సర్వే అనంతరం జిల్లా ల్యాండ్ సర్వే రికార్డు నుంచి సంబంధిత రైతులకు నోటీసులు అందించారు. దీంతో 138మంది సర్వేపట్ల అభ్యంతరాలు తెలపడంతో క్షేత్రస్థాయిలో వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. మిగిలిన రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. నోటీసుల అనంతరం అక్టోబరులో రైతులకు సర్వేనెంబర్ల కేటాయించడంతో పాటు టిప్పన్‌లు, పొలం సరిహద్దులతో మ్యాపులు ఇవ్వనున్నారు. ఈసారి క్యూఆర్ కోడ్‌తో రైతులకు ఈమ్యాపులు అందించబోతున్నందున రికార్డులు పక్కాగా ఉండనున్నాయని జిల్లా ల్యాండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఐదు గ్రామాల్లో మొలుగుమాడు ఒక్కటని, మిగిలిన గ్రామాలకంటే ఇక్కడే భూమి ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రతీ టిప్పన్‌కు క్యూఆర్‌కోడ్ ఏర్పాటుచేస్తున్నామని, గ్రామపంచాయతీల్లోనే అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని వివరించారు.

గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల పదోన్నతులనూ పూర్తి చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్,పారుపల్లి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయకపోతే గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని జిల్లా కమిటీ హెచ్చరించింది.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగినుల వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కీసర రాంగోపాల్ రెడ్డి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. స్వీయనిర్వహణ పద్ధతిపై హాస్టల్‌లో ఉండేందుకు అనుమతి ఉందన్నారు.ప్రవేశానికి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో లేదా ఏదైనా సంస్థ, షాపింగ్ మాల్‌లో ఉద్యోగం చేస్తున్న 18నుంచి 40 సంవత్సరాలలోపు మహిళలు అర్హులని తెలిపారు. మరిన్నివివరాలకు 790101 7341లో సంప్రదించాలని తెలిపారు.

క్రైస్తవుల సమాధుల స్థలాలను రక్షించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆక్రమణకు గురైన విలువైన క్రైస్తవుల సమాధుల స్థలాలను రక్షించాలని సెయింట్ మేరీస్ సీఎస్ఐ చర్చి, పాస్టేట్ చైర్మన్ విశ్వం డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎస్ఐ చర్చిలో జిల్లా సీఎస్ఐ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేపు నగరంలో సమాధుల స్థల సాధన మహా ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు.

'ఇండోర్' స్ఫూర్తితో చెత్త సేకరణ

- ప్రతీ ఇంట్లో కంపోస్టు తయారీ చేపట్టాలి
- మెప్మా ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు
- మేయర్ పునుకొల్లు నీరజ
- 26వ డివిజన్‌లో ప్రారంభం



ఎస్‌హెచ్‌జీ సమావేశంలో అవగాహన కల్పిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇండోర్ పర్యటన స్ఫూర్తితో నగరంలో ప్రతీ ఇంట్లో కంపోస్టు తయారు చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం 26వ డివిజన్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏరియా లెవల్ ఫెడరేషన్(ఏఎల్ఎఫ్) మహిళా సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల ఇండోర్ స్టడిటూర్‌లో గమనించిన విషయాలను స్థానిక మహిళా సంఘాలకు మేయర్ అవగాహన కల్పించారు. ప్రతీ ఇంట్లో నిత్యం తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వలు చేయాలని చెప్పారు. తడి చెత్త ద్వారా గ్యాస్, వర్మీ కంపోస్టు తయారు చేసే విధాన్ని మేయర్ వివరించారు. రాత్రిసమయంలో మిగిలిన అన్నం కూడా సేంద్రియా ఎరువుల తయారీలో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ముందుకు వస్తే ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి శిక్షణ ఇస్తామన్నారు. నివాసాల్లో తయారు చేసిన వర్మీకంపోస్టును కేఎంసీ నుంచి కొనుగోలు చేస్తామన్నారు.అన్ని రంగాల్లో ఖమ్మం ఎంతో అభివృద్ధి చెందిందని పారిశుధ్యంలోను నెంబరు1గా ఉండాలంటే నగరంలోని మహిళలు మంచి అవగాహనతో తడి,పొడి,హానికరమైన, ప్లాస్టిక్, మట్టి, ఔషధాల వ్యర్థాలను విడివిడిగా కేఎంసీ వాహనాలకు ఇవ్వాలని మేయర్ నీరజ కోరారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా మాట్లాడుతూ ఇండోర్‌లో మహిళలు చేస్తున్న పారిశుధ్య పనులను మహిళలకు వివరించారు. టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవో చిలకా ద్రౌపది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ

నగరంలో డ్రైడేఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. 26వ డివిజన్‌లో మేయర్ పునుకొల్లు నీరజ ఇంటింటి పారిశుధ్య సర్వేల్లో పాల్గొన్నారు. నివాసాల్లోకి వెళ్లి లార్వా నిల్వలను గుర్తించారు. పాతటైర్లు, కూలర్లు, వ్యర్థాలను పరిశీలించి దోమల లార్వాలపై అవగాహన కల్పించారు. బావుల్లో దోమలు, లార్వ నివారణ మందులు చల్లారు. ఇంటింటికి మొక్కల కార్యక్రమాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, టీఎంసీ గుడిపూడీ సుజాతరాణి, సీవో చిలకా ద్రౌపది, వార్డుఆఫీసర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, జవాన్, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాల అంగన్‌వాడీ కేంద్రం

- ఈడబ్ల్యూడీ రామ్‌గోపాల్‌రెడ్డి విచారణ
- ఆయాకు మెమో జారీ

రఘునాథపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిన్నారి పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు చెప్పాల్సిన అంగన్వాడీ కేంద్రం వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇటువంటి సంఘటనలే చోటు చేసుకొగా, మరోసారి పునరావృతమయ్యాయి. సాక్షాత్తు కలెక్టర్ కార్యాలయం ఉన్న గ్రామంలోనే ఇటువంటి సంఘటన జరగటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వర్షాలు వరదల ప్రభావంతో గురువారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సెలవు ప్రకటించారు. కాగా రఘునాథపాలెం మండలంలోని వీ.వెంకటాయపాలెం అంగన్వాడీ-1 కేంద్రంలో మధ్యాహ్నాలో ఓయువకుడు ఉండటం వివాదానికి కారణమైంది. సెలవు రోజు అంగన్వాడీ కేంద్రం తెరవటంపై గ్రామస్థులు ఐసీడీఎస్ అధికారులకు గురువారంరాత్రి ఫిర్యాదు చేశారు. శుక్రవారం వీ వెంకటాయపాలెంలోని సదరు అంగన్వాడీ కేంద్రానికి జిల్లా సంక్షేమాధికారి రామ్‌గోపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. అంగన్వాడీ ఆయాకు మెమో జారీ చేశారు. మరోసారి ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కాగా ఈవిషయంపై ఐసీడీఎస్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఓ యువకుడు తనకు ప్రాణహాని ఉందని రక్షణ కోరితే ఆయా అంగన్వాడీ కేంద్రంలో ఉంచినట్లు ప్రాథమికంగా తమకు సమాచారం అందిందన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



వెంకటగిరిలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలో పలుఅభివృద్ధి పనులకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూరల్ మండలంలోని చింతపల్లి, వెంకటగిరి గ్రామాల్లో ఈపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.2కోట్ల50లక్షలతో 33 కేవి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఖమ్మం, కోదాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఇందిరమ్మకాలనీరోడ్డు, వెంకటగిరిఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఖమ్మం వరకు రహదారులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.20నెలలలో వెంకటగిరిప్రాంత అభివృద్ధికి రూ.10 కోట్ల,40లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం 56 మందికి కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులు మంత్రి చేతులమీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, ఆర్డీఓ నరసింహరావు, తహసీల్దార్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

అర్బన్ పార్క్ రహదారి పునరుద్ధరణ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వైరా ప్రధాన రహదారి నుంచి ఖమ్మం అటవీ అర్బన్ పార్కు రహదారిని శుక్రవారం పునరుద్ధరించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరద నీటితో రహదారి రాకపోకాలు నిలిచిపోయాయి. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆ ప్రాంతానికి వెళ్లి జేసీబీలతో వరద వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

త్వరలో రహదారి పనులకు శంకుస్థాపన

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పదిహేను రోజుల్లో పింజరమడుగు తాళ్లగూడెం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తానని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గ్రామస్తుల ఎదుట హామీ ఇచ్చారు. శుక్రవారం పింజరమడుగు గ్రామంలో 20డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించటంతో ఈఇళ్లను పరిశీలించారు. కరెంట్, మంచినీరు, మరమ్మతులకు గురైన ఇళ్ల రిపేరింగ్ పనులకు ఎస్టిమెషన్ వేయమని ఐటీడీఏ అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కమీషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంత రావు, బావ్‌సింగ్, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపుడి రాంబాబు, డీ.సత్యనారాయణ, బొడ్డు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నందమూరి హరికృష్ణకు నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ రాజ్యసభ సభ్యులు నందమూరి హరికృష్ణ 7వ వర్ధంతిని జిల్లా టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు కేతినేని హరీష్ చంద్ర దివంగత హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరికృష్ణ తన తండ్రికి తగిన తనయుడిగా చైతన్య రథ సారథ్య బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి హరికృష్ణ చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాటమనేని వీరభద్రరావు, మీగడ రామారావు, చింతనిప్పు నాగేశ్వరరావు, నున్ననవీన్, కన్నేటి పృథ్వి, ఎల్లంకి నర్సింహారావు, చల్లగుండ్ల మరేష్, బోడేపూడి రవి, గంగవరపు ఆనందర్‌కుమార్ వక్కంతుల రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

తిరుమలాయపాలెం,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం రూ.40వేల విలువగల పుస్తకాలతోపాటు బీరువాను వితరణగా అందించారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్‌హ్యూమన్ వాల్యూస్ సంస్థ వారు అందించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం విజయకుమారి, పెసల ప్రభాకర రెడ్డి, సంస్థ ప్రతినిధులు కిషోర్, ఏవీ నాగేశ్వరరావు, నరేందర్, విజయలక్ష్మీ, కృష్ణ తదితరులుపాల్గొన్నారు.

న్యాయాధికారి అఖిలగౌడ్ పరిచయ కార్యక్రమం

ఖమ్మంలీగల్,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఖమ్మంబార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన న్యాయాధికారి అఖిల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈపరిచయ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీఫార్మసీ పూర్తిచేసి న్యాయాధికారిగా నియామకమైన అఖిల గౌడ్‌ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం న్యాయాధికారి అఖిలగౌడ్ మాట్లాడుతూ బార్ బెంచ్ మధ్య మంచి సంబంధాలు కొనసాగిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం అందజేయటమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈపరిచయ కార్యక్రమంలో న్యాయాధికారులు అర్చన కుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, వినుకొండ మాధవి, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో పూజ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం జిల్లాలోని పలువినాయక మండపాలలో మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు.గణేష్ మండప నిర్వాహకులు భక్తులకు పూజా సామగ్రి పంపిణీ చేశారు. జయనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజల నిర్వహించారు. బురహాన్‌పురం శ్రీగణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో, బాలాజీనగర్‌లో స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు.



బ్యాంకు కాలనీలో కుంకుమ పూజ



జయనగర్‌లో..



బుర్హాన్‌పురంలో..



బాలాజీనగర్‌లో..

కేఎంసీ ఉద్యోగులపై దూషణలు

- సమస్యలపై ఫిర్యాదుకు వచ్చిన నాయకులు
- అనుమతించక పోవటంతో వివాదం
- నాయకులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు



కమిషనర్ ఛాంబర్‌లో గొడవ దృశ్యం

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన సీపీఐ నాయకులు కమిషనర్ ఛాంబర్‌లోని ఉద్యోగులపై గొడవ పడటంతో చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ సంఘటన ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో చోటుచేసుకొంది. సీపీఐ సీనియర్ నాయకుడు మహ్మద్ సలామ్ మరికొందరి నాయకులతో కలిసి శుక్రవారం కేఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. ఓప్రైవేట్ హాస్పటల్ అక్రమ నిర్మాణంతో పాటుగా నగరంలో పారిశుధ్యలోపంగా ఫిర్యాదు చేసేందుకు నాయకులను వెంట తీసుకొని వచ్చారు. అయితే ఆ సమయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో బిజీగా ఉండటంతో అక్కడి అధికారులు సీపీఐ నాయకులను కమిషనర్‌ను కలిసేందుకు అనుమతించలేదు. పెద్దగా కేకలు వేయటంతో ఛాంబర్‌లో నుంచి కమిషనర్ బయటకు వచ్చారు. అయినా నాయకులు కమిషనర్ ఎదుటే మళ్లీ వాగ్వాదం చేశారు. కమిషనర్ అయితే ఏంటీ అని హిందీలో సీరియస్‌గా మాట్లాడారు. వివాదం పెరగటంతో పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకొని ఖమ్మం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సంఘటనపై కేఎంసీ కమిషనర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

డైవర్షన్ రాజకీయాలు వద్దు: బీఆర్ఎస్



మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమార్కెట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు డైవర్షన్ రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు హితవు పలికారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరులసమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమై బీఆర్ఎస్ నాయకులుపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇటీవల 48వ డివిజన్‌లో జరిగిన సంఘటనలో మాజీకార్పొరేటర్ తోట రామారావుపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని అందుకు ఊరుకునేది లేదని హెచ్చరించారు.గతంలో బీఆర్ఎస్ హయాంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉండగా ఇప్పుడు 64వ స్థానంలో ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో వ్యవహారంలో అవినీతి విరాజిల్లుతుందని, పారిశుధ్యం పడకేసిందని, ప్రొటోకాల్‌ను అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుండాల క్రిష్ణ, నాయకులు మాటేటి నాగేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం, తోట వీరభద్రం, మక్బుల్, ఎర్రా అప్పారావు, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంస్పోర్ట్స్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఇటీవల నగరంలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలలో తమ పాఠశాలలో చదువుతున్న శ్రేయాన్ ద్వితీయ బహుమతి సాధించాడని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ రాజావాసిరెడ్డి నాగేంద్రకుమార్ తెలిపారు. ఖో-ఖో, కబడ్డీ క్రీడల్లో సైతం ప్రతిభ చూపారని తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రేయాన్ అభినందించారు.

గిరిజన విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

ఖమ్మంలీగల్,ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారం శుక్రవారం ఖమ్మం న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.వి.చంద్రశేఖరరావుఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలోని ప్రభుత్వ గిరిజన పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటుచేశారు. పాఠశాలలో మౌలిక వసతులు, భోజనం సరిగా లేకుంటే న్యాయసేవాధికారసంస్థ ఖమ్మంటోల్‌ఫ్రీ నెంబర్ 15100కి ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇతర ఎలాంటి ఇబ్బందులు ఉన్నా న్యాయసేవాధికారసంస్థను సంప్రదించాలని సూచించారు. సందర్శించిన వారిలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటండి

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్



చిన్నారిని ఆశీర్వదిస్తున్న యుగంధర్

నేలకొండపల్లి, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు తుమ్మల యుగంధర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం నేలకొండపల్లిలోని శ్రీకర గార్డెన్స్‌లో జరిగిన చెన్నారం గ్రామానికి చెందిన మంకెన వెంకటేశ్వర్లు మనుమడి నామకరణ కార్యక్రమంలో తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతీ ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం అందుతుందన్నారు. తొలుత గోగినేని పుల్లయ్య ఇంటి వద్ద కొద్ది సేపు ఆగిన యుగంధర్‌ను గోగినేని సతీష్ దంపతులు, తుమ్మల సోషల్ మీడియా నాయకుడు కొమ్మూరి నరేష్ శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో మంకెన వెంకటేశ్వరరావు, కొమ్మూరి నరేష్, సైదారావు, జగదీష్, వీరు, గోగనేని సతీష్, నర్సింహారావు, ఫణి, ప్రసాద్, కాంగ్రెస్ యువజన నాయకులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE
శనివారం 30 ఆగస్టు 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

వైరాలో షటిల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

వైరా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైరా ఇండోర్ స్టేడియంలో అండర్-13, 15, 17 బాలబాలికలకు షటిల్ పోటీలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ అన్వర్, ఐటీ అధికారి శేషుకుమార్ ఈ క్రీడలను ప్రారంభించారు. కోచ్ అంజద్‌పాషా ఆధ్వర్యంలో ఈ క్రీడలు జరిగాయి. క్రీడల అనంతరం పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు.

మాతృభాషతోనే సర్వతోముఖాభివృద్ధి

» ఘనంగా జాతీయ మాతృభాషా, క్రీడా దినోత్సవాలు



పద్మావతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, తద్వారా మాతృభాషపై పట్టు సాధించవచ్చునని ప్రిన్సిపాల్ డా.ఎన్.గోపీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషా ఉద్యమాన్ని నడిపి విజయం సాధించడంలో గిడుగు కృషిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. తెలుగు విభాగాధిపతి డా.చీపు పూర్ణచంద్రరావు, కామర్స్ విభాగాధిపతి డా.ఓ.చెన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శుక్రవారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కిష్టారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడాకారుడు స్వర్గీయ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయురాలు చిరుమామిళ్ల పద్మావతి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఏఎల్‌వీ.రాంబాబు, బొంతు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎండీ.రియాజుద్దీన్, ఎస్‌డీ.సమద్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధిర రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడుపల్లి, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆచార్య గిడుగు రాంమ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని అలాగే హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంమ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దీవి సాయికృష్ణమాచార్యులు, ఉపాధ్యాయులు శైలజ, మాధవరావు, రాయల రవి, చంద్రశేఖర్, రమాదేవి, వీరయ్య, సుదర్శనం, వెంకటేశ్వరస్వామి, యరమల గోపాల్‌రెడ్డి, లకావత్ బంగారు, కళాశాల ప్రిన్సిపాల్ బి.జయదాసు, ఎన్ఎస్ఎస్ పీవో తౌరియా, అధ్యాపకులు ఆర్.లత, షహీన్‌బేగం, సాంబయ్య, యు.కృష్ణ, విక్రం పాల్గొన్నారు.



కోతులు, కుక్కల బెడదను నివారించాలి

ముదిగొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ గ్రామంలో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉందని వాటిని నివారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ.. కోతులు, కుక్కల దాడుల వల్ల చాలామంది గాయపడి ఆస్పత్రులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని బ్లీచింగ్, పాగింగ్ చేయాలని కోరారు. అనంతరం గ్రామ సమస్యలపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంకెన దామోదర్, బట్టు రాజు పాల్గొన్నారు.

కిలోమీటరు పొడవులో.. 33 గుంతలు

» జాతీయ రహదారిపై ప్రమాకరంగా గుంతలు
» రాత్రిపూట ప్రయాణం ప్రమాదమే



పల్లిపాడు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కొణిజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇదొక జాతీయ రహదారి. కిలోమీటరు పొడవులోనే 33 పెద్దగుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో కార్ల టైర్లు పడి పంచర్‌లు అవుతున్నా, ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నా సంబంధిత అధికారులుకు ఏ మాత్రం పట్టడంలేదు. అసలే ఇటీవల రహదారిపై గుంతలు పడి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడుతుంటే గత నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షాలకు మరింత భారీగ గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొణిజర్ల మండలం పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి పల్లిపాడు వరకు 33 భారీ గుంతలు కనిపిస్తున్నాయంటే మిగిలిన రహదారిపై ఎన్ని గుంతలు ఉన్నాయో అర్థం చేసుకోవలసి ఉంది. మండల పరిధిలోని తనికెళ్ల దగ్గర నుంచి వైరా శాంతినగర్ వరకు జాతీయరహదారిపై గుంతలు కనిపిస్తున్నాయి. పల్లిపాడు సమీపంలో గతంలో గుంతలును తప్పించబోయి అనేక వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఉన్నతాధికారుల నుంచి మండల అధికారులు, నేతలు సైతం ఆ రహదారి నుంచే ప్రయాణిస్తున్నారుగాని గుంతలను పూడ్పించే చర్యలు తీసుకోవడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో ద్విచక్రవాహనదారుకలు గుంతలు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా అంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలను పూడ్చాలి



తాటిపల్లి సుధీర్, పల్లిపాడు

పల్లిపాడు సమీపంలో జాతీయరహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. రెండు రోజుల క్రితం కూడ కారు గుంతల్లో పడి టైర్లు పగిలిపోయాయి. ద్విచక్రవాహనదారుడుకి ప్రమాదం జరిగింది. సంబధిత శాఖాధికారులు కనీసం పట్టించుకుని తాత్కాలికంగా అయినా గుంతలను పూడ్చి వాహనదారులకు ప్రమాదం జరగకుండ కాపాడాలి. గతంలో అనేక ప్రమాదాలు ఈ గుంతల వల్లే జరిగినవని అధికారులకు తెలుసు. అప్పుడు ఆ గుంతలను పూడ్చి ప్రజల ప్రాణాలు కాపాడారు. మరల అదే ప్రదేశాల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. స్పందించి గుంతలను పూడ్చాలి.

దివ్యాంగులు ఉపకరణాలను వినియోగించుకోవాలి



దివ్యాంగుల శిబిరం నిర్వాహకులతో మాట్లాడుతున్న శ్రీజ

వైరా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులు తమకు లభించిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారిణి అయిన డాక్టర్ పి.శ్రీజ సూచించారు. జిల్లా విద్యాశాఖలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. శుక్రవారం వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అలీంకో వారి సహకారంతో జిల్లా సమగ్ర శిక్షణ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని డాక్టర్ శ్రీజ సందర్శించారు. ఎర్రుపాలెం, మధిర, చింతకాని, బోనకల్, కొణిజర్ల, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, వైరా మండలాల్లోని 18సంవత్సరాల్లోపు దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి అందించేందుకు అలీంకో డాక్టర్లతో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ మండలాల నుంచి వచ్చిన మండల ఐఆర్‌పీలకు జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్, ప్రత్యేక అవసరాలు కలిగినటువంటి విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు డాక్టర్ శ్రీజ పలు సూచనలు చేశారు. ఈ క్యాంపులో ఇచ్చే సౌకర్యాలను తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వైరా ఎస్సీ, బీసీ కాలనీల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్య, వర్క్, నోట్‌బుక్స్, యూనిఫాం అందాయా లేవా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వీటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖలో సాంకేతికంగా ఉన్న సమస్యలను తెలుసుకొని రాష్ట్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైరా ఎంఈవో వెంకటేశ్వర్లు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

ఏన్కూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. మహిమ పదో తరగతి ఫలితాల్లో 520మార్కులు సాధించినందుకుగాను ఇదే పాఠశాలలో పనిచేస్తున్న సాగి సుజాత (జీవశాస్త్రం), పొట్ట రామారావు (భౌతికశాస్త్రం) ఉపాధ్యాయ దంపతులు శుక్రవారం రూ.5వేల నగదు టెక్స్ట్ బుక్స్‌కొరకు సహాయం అందించారు. అదేవిధంగా పూర్వవిద్యారుధ్ల సంఘం కళాశల ఫీజు నిమిత్తం రూ.10వేలు అందించారు. పాఠశాల హెచ్ఎం పి.నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పుల్లయ్య, శ్రీనివాసరావు, భారతి, విజయశ్రీ, నరేష్, నాగేశ్వరరావు, బాప్‌సింగ్‌పాల్గొన్నారు.

వైరా సొసైటీకి యూరియా సరఫరా చేయాలి

వైరా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైరా విశాల పరపతి సహకార సంఘానికి 15రోజుల నుంచి యూరియా సరఫరా చేయకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. శుక్రవారం వైరా సొసైటీ కార్యాలయంలో నిరసన తెలియజేసి మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్, సొసైటీ సీఈవో కుంటముక్కల ఆనంద్‌కు వినతిపత్రాలు సమర్పించారు. 15రోజుల నుంచి యూరియా లేక సొసైటీ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆ వినతి పత్రంలో తెలిపారు. వెంటనే యూరియా సరఫరా చేయకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు హెచ్చరించారు. నాయకులు మల్లెంపాటి రామారావు, షైడిపల్లి సాంబశివరావు, తోట నాగేశ్వరరావు, అమరనేని కృష్ణ, వీరభద్రం పాల్గొన్నారు.

కొత్త లంకపల్లి సమస్యలు పరిష్కరించాలి

పెనుబల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త లంకపల్లి పంచాయతీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి ఒక వినతిపత్రం అందజేశారు. కొత్త లంకపల్లి పంచాయతీలోని గిరిజనులు నివాసముంటున్న ప్రాంతానికి నేరుగా మంచినీటి పైప్‌లైన్ ఇవ్వడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారని, మంచినీటి ట్యాంకు నిర్మించాలని, చెత్తాచెదారం రోడ్డు పక్కన పడవేయడం వల్ల దుర్వాసనతో వ్యాధుల బారీనపడుతున్నారని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నాయకులు తడికమళ్ల చిరంజీవి, చిలకా రమణ, తలసాని శ్రీనివాసరావు, గుడిమెట్ల బాబు, సత్యనారాయణ, షేక్.సర్దార్, బజార్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు అండగా ప్రభుత్వం



మునలిమడుగులో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



బాలికలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వైరా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్ మిలాఖత్‌తోనే తెలంగాణ రైతులకు యూరియా కొరత ఏర్పడిందని ఆయన ఆరోపించారు. గడచిన మూడురోజుల నుంచి కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చేతులు కలిపి కేంద్రం నుంచి రాష్ట్రానికి యూరియా రాకుండా అడ్డుపడుతున్నాయని విమర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా, ఏన్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, స్వర్ణ నరేందర్, ధార్న రాజశేఖర్, నర్వనేని అశోక్, వేమూరి పుల్లారావు, తుమ్మల సత్యం, అభ్యుదయ రైతు తుమ్మల రాణాప్రతాప్ పాల్గొన్నారు.

ఏన్కూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు కస్తూర్బాగాంధీ విద్యాలయానికి వైరల్‌ఫీవర్ సోకింది. దీంతో విద్యాలయంలోని బాలికలు జలుబు, దగ్గు, ఒళ్లనొప్పులు, విషజ్వరాలతో 189మంది ఇంటిబాట పట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శుక్రవారం విద్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఎస్‌వో లావణ్యతో మాట్లాడారు. జ్వరాలు సోకిన వారిని ఇళ్లకు పంపవద్దని ఆదేశించారు. ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని సీహెచ్ఎస్సీ వైద్యులను ఆదేశించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, మండల నాయకుఉల లచ్చిరాంనాయక్, చందమామనరసింహారావు, నల్లమల శివకుమార్, పూర్ణకంటి షైసారావు, పటాన్ మజీద్‌ఖాన్, నిమ్మల నాగేశ్వరరావు, మాదినేని లెనిన్, కట్టా సత్యనారాయణ, సక్రునరాయక్, మాలోతు నరసింహారావు, చింతనబోయిన సీతారాములు, గిద్దగిరి సత్యనారాయణ, పంతగాని నరేష్ పాల్గొన్నారు.

మొలుగుమాడు భూములకు 'టిప్పన్'

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని ఈగ్రామంలో మోడల్ సర్వేచేపట్టాలని నిర్ణయించడంతో ఆయనతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ గ్రామంలో సర్వే ప్రక్రియను జూన్3న ప్రారంభించారు. దీంతో మూడు బృందాలను ఏర్పాటుచేసి గ్రామంలో మొత్తం 103 సర్వేనెంబర్లు 1260 సబ్‌డివిజన్లలో 852.17 ఎకరాలు సర్వేచేసి నిర్ధారణ చేశారు. ఇందులో పట్టా భూమి 227.15 ఎకరాలు 627మంది రైతులకు సంబంధించినదిగా గుర్తించారు. గతంలో ఈగ్రామం ఏపీ పరిధిలో ఉండడంతో భూ రికార్డుల్లో ఉండడం, సెంట్లలో ఉండడం, మ్యాపులు లేకపోవడం తదితర సమస్యలు తలెత్తాయి. ఈ గ్రామంలో ఈనాం భూములు 21.9ఎకరాలు, ప్రభుత్వం భూమి 10.17ఎకరాలు, రోడ్ల కింద 9 ఎకరాలు, వాగుల కింద 9.11ఎకరాలు చెరువుల కింద 25.30ఎకరాలు, గ్రామకంఠం కింద 49.38 ఎకరాలు ఆయా ప్రభుత్వ శాఖల పరిధికి సంబంధించిన భూమిగా 53.29 ఎకరాలుగా నిర్ధారించారు. డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్‌లో సర్వే నిర్వహించి టిప్పన్‌లు సిద్ధం చేశారు. అయితే సర్వే అనంతరం జిల్లా ల్యాండ్ సర్వే రికార్డు నుంచి సంబంధిత రైతులకు నోటీసులు అందించారు. దీంతో 138మంది సర్వేపట్ల అభ్యంతరాలు తెలపడంతో క్షేత్రస్థాయిలో వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. మిగిలిన రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. నోటీసుల అనంతరం అక్టోబరులో రైతులకు సర్వేనెంబర్ల కేటాయించడంతో పాటు టిప్పన్‌లు, పొలం సరిహద్దులతో మ్యాపులు ఇవ్వనున్నారు. ఈసారి క్యూఆర్ కోడ్‌తో రైతులకు ఈమ్యాపులు అందించబోతున్నందున రికార్డులు పక్కాగా ఉండనున్నాయని జిల్లా ల్యాండ్ సర్వేరికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఐదు గ్రామాల్లో మొలుగుమాడు ఒక్కటని, మిగిలిన గ్రామాల కంటే ఇక్కడే భూమి ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రతీ టిప్పన్‌కు క్యూఆర్‌కోడ్ ఏర్పాటుచేస్తున్నామని, గ్రామపంచాయతీల్లోనే అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని వివరించారు.

ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలి: సీపీఎం

తల్లాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను వెంటనే చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడానలి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం నాయకులు కళ్యాణం కృష్ణయ్య, సత్తెనపల్లినరేష్, వంగూరి లోకేశ్వరరావు, సుందరరావు, రాము, గోపి పాల్గొన్నారు.

నేడు కల్లూరుకు మందకృష్ణమాదిగ రాక

కల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఆసరా పెన్షన్‌దారుల సభలో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ శనివారం రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాదిగ, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి దారెల్లి వెంకటేశ్వరరావులు తెలిపారు. ఈ సభకు కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధిపై బీజేపీ అధ్యక్షుడికి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న మండల నాయకులు

చింతకాని, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ మండల కమిటీ ఆధర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావుకు వినతిపత్రం సమర్పించారు. స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బల్లాలు, త్రాగునీరు, విద్యుత్ లైట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండా గోపి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఏలూరి నాగేశ్వరరావు, సోమగాని ఎల్లారావు, నాగులు, పరశురాములు పాల్గొన్నారు.

చింతకాని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగులవంచ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాస్ శుక్రవారం సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులకు కలసి వినతిపత్రం సమర్పించారు. రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను నిలపాలని, స్టేషన్‌లో లైటింగ్ ఏర్పాటుతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాతర్లపాడు గ్రామస్థులు గుడ్ల వెంకటేశ్వర్లు, కరణం తిరుమలరావు, అమరనేని విజయ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ

మధిర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మధిర తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రాంబాబు లబ్ధిదారుకి కళ్యాణలక్ష్మి చెక్కును మండలంలోని నిదానపురం గ్రామానికి చెందిన షేక్ జాన్‌బీకి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, గుండా వీరారెడ్డి, మాజీ సర్పంచ్ బాధా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి సన్నాహక సభను విజయవంతం చేయండి

తల్లాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో శనివారం జరిగే వికలాంగులు, వితంతువులు, వృద్దులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత, ఆసరా పింఛన్‌దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునిల్‌మాదిగ కోరారు. శుక్రవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లడుతూ.. ఆసరా పింఛన్లు పెంచుతామని హామి ఇచ్చి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 20నెలలు గడుస్తున్నా ఇవ్వకుండా మోసం చేస్తుందని విమర్శించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మందకృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ సత్తుపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి కారుమంచి వెంకన్న, తల్లాడ మండలం ఇన్‌చార్జి మాగంటి వెంకటేశ్వర్లు, ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి కోట బలరాం, నాగేశ్వరరావు పాల్గొన్నారు .

ఆర్‌ఐలను నియమించాలి

కారేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐలు లేక పోవంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు ఆర్‌ఐలను బదిలీచేయడంతోపాటు మండలానికి నూతన తహసీల్దార్ రావడం వల్ల పనులు చేసేవారు లేకపోవడంతో విద్యార్థులు ధ్రువీకరుణ పత్రాల కోసం కోసం కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని మండలానికి తక్షణమే ఇద్దరు ఆర్‌లను నియమించాలని పలువురు కోరుతున్నారు.

రేపు ఖమ్మం జిల్లా డీవైఎఫ్ఐ మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కారేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలు ఈనెల31న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగనున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాగం రామనర్సయ్య భవనంలో డీవైఎఫ్ఐ మండల మహాసభ జరిగింది. మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న యువజన ప్రజాసమస్యలపై సమరశీల పోరాటాలకు డీవైఎఫ్ఐ సిద్ధం అవుతుందన్నారు. ఈ సందర్భంగా మండల డీవైఎఫ్ఐ నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షకార్యదర్శులుగా ధారవత్ వినోద్, అజెర్ల వినయ్‌లతో పాటు 17మందితో సభ్యులుగా ఎన్నుకున్నారు.

బోనకల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరగనున్న 21వ డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా ముత్తారావు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం తమ సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ సంఘ నాయకులు రోహిత్, నరేష్, బంకా శ్రీను, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం తనయుడి బర్త్ డే

బోనకల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోనకల్, రావినూతల తదితర గ్రామాల్లో శుక్రవారం డిప్యూటీ సీఎం తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా, మండల నాయకులు షైడిపల్లి కిషోర్ కుమార్, కర్నాటీ రామకోటేశ్వరరావు, గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, చేబ్రోలు రమ, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బీపీ నాయక్, వై. హేమూన్, జయప్రియ కుమార్, భద్రు నాయక్, తోటపల్లి స్వామి, మరీదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముదిగొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య పుట్టిన రోజు వేడుకలను వల్లభి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు బిచ్చాల అన్వేష్, ఏలూరి భాస్కర్, రాఘవ, గుడ్‌సాహెబ్, రామారావు, వెంకటేష్, అనిల్, వీరబాబు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



ప్రమాదాలు నిత్యకృత్యం



వైరా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైరా-మధిర, జగ్గయ్యపేట రూట్లో అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై భారీ వాహనాలు దిగబడడం నిత్యకృత్యంగా మారింది. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌లో కనీస చలనం లేదు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సహా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు ఈ రోడ్డు నుంచి తరచూ రాకపోకలు కొనసాగిస్తున్నప్పటికీ ఈ అసంపూర్తి రోడ్డు గురించి కనీసం పట్టించుకోవడం లేదు. రూ.12కోట్ల నిధులతో దాదాపు ఏడాదిన్నర కిందట నాలుగులైన్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇవి నత్తనడకను తలపిస్తున్నాయి. ఈ రూట్లో నిత్యం వేలాది భారీ వాహనాలు జగ్గయ్యపేట, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు మధ్య రాకపోకలు కొనసాగిస్తున్నాయి. హెవీ లోడ్‌తో ఉన్న లారీలు ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో కొద్దిగా పక్కకు వెళ్తే లారీలు డివైడర్ల కోసం పోసిన మట్టిలో దిగబడి పోతున్నాయి. వారంరోజుల వ్యవధిలో ప్రతిరోజూ పలు వాహనాలు దిగబడిపోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

రైతులను దివాళా తీయించే జీవోను రద్దు చేయాలి

పెనుబల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో పత్తి మార్కెట్‌కు వచ్చే తరుణంలో విదేశీయ పత్తి దిగుమతిపై ఉన్న 11శాతం సుంకాన్ని రద్దు చేయడం వల్ల రైతులను దివాళా తీయించడమేనని అఖిలభారత ఐక్య రైతుసంఘం కల్లూరు డివిజన్ కార్యదర్శి బీరెల్లి లాజర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పరిశ్రమల యజమానులకు లాభాలు తెచ్చిపెట్టడం కోసం డిసెంబరు 30వరకు పత్తి దిగుబడిపై సుంకాన్ని ఎత్తివేయడం దారుణమన్నారు. దేశీయ పత్తి మార్కెట్‌కు వచ్చే తరుణంలో రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికాలో వ్యవసాయ సబ్సీడీలు అధికంగా ఉన్నందున పత్తికి ధర తక్కువగా లభిస్తుందని, మన పత్తి మార్కెట్లోకి రాక ముందే ఈ వెసులుబాటును ఉపయోగించుకొని టెక్స్‌టైల్ కంపెనీ యజమానులు దేశీయ పత్తిని దిగుమతి చేసుకుని గోదాముల్లో ఉంచుతున్నారని దీనివల్ల ఇక్కడి పత్తిని కొనేవారు లేకపోవడంతో పత్తి ధరలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్లే పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విదేశీయ పత్తిని దిగుమతి చేసుకోకుండా జీవోను రద్దు చేయాలని ఆయన కోరారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సత్తుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరేందుకు దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి మాల మహానాడు బాధ్యులు అన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి బాసర త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన వేంసూరు మండలం దుద్దేపూడికి చెందిన పూరేటి వెంకటేశ్వరరావు, లక్ష్మీ దంపతుల కుమార్తె హర్షితను స్థానిక న్యూస్టార్ ఆసుపత్రిలో ఘనంగా సన్మానించిన అనంతరం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నక్కా మల్లిఖార్జునరావు, డా.సురేష్ రామాల, ప్రెస్‌క్లబ్ వైస్ చైర్మన్ యనమాల విజయ్, బాధ్యులు పిల్లి మల్లిఖార్జునరావు, పిల్లి సురేష్‌కుమార్, కోపల్లి రత్తయ్య, బల్లెం చిరంజీవి, పిల్లి వెంకటేశ్వరరావు, నక్కా మోహనరావు, కటుకూరి కృష్ణ, గుంట్రు అరుణ్ తదితరులు

బేతుపల్లి చెరువు ఘాట్‌ను సందర్శించిన దయానంద్

సత్తుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల సందర్భంగా నిమజ్జనాలు నిర్వహించే మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువు ఘాట్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని, భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. అంతకముందు పాముకాటుతో మృతిచెందిన చిన్నపాకలగూడెంలోని గౌర మౌనిక నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

